పూజల్లో పాల్గొన్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

వైభవంగా బసవలింగేశ్వరుడి కల్యాణోత్సవం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 11 : మండలంలోని దంతూరులో గల బసవలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలు ధరింపజేసి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మన్నెం వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షురాలు బత్తుల మాధవీశ్రీశైలంగౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దోటి కుమార్, నాయకులు రవీందర్‌రెడ్డి, పాండు, మురళీకృష్ణ, శ్రీను, సత్తయ్య, రవీందర్, శేఖర్, లింగస్వామి పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

రంజాన్‌కు ఏర్పాట్లు చేపట్టాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరికలెక్టరేట్, మార్చి 11 : నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతున్నందున అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో రంజాన్ మాసం పురస్కరించుకొని నిర్వహించిన శాంతిసంఘం సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. రంజాన్ సందర్భంగా సంబంధిత శాఖలకు కేటాయించిన విధులను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. మసీదుల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందుల సమాచారం ముందుగా తెలిపితే అందుకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అలాగే మసీదుల వద్ద బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, రెవెన్యూ డివిజనల్ అధికారులు అమరేందర్, శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కృష్ణన్, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, మైనారిటీ అధికారి యాదయ్య, పంచాయతీ అధికారి సునంద, అగ్నిమాపక అధికారి జయకృష్ణ, పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఎం సివిల్ సప్లయ్ గోపీకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, శాంతి సంఘం పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి

రానున్న భువనగిరి పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే కోరారు. సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పోలింగ్ కేంద్రాలు, వాటి మార్పులపై వివరించారు. ఓటరు నివాసానికి, పోలింగ్ కేంద్రానికి మధ్య 2 కిలోమీటర్లకు మించి దూరం ఉన్నట్లయితే అనుబంధ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భువనగిరి, ఆలేరు, మునుగోడు(చౌటుప్పల్, నారాయణపూర్) నకిరేకల్(రామన్నపేట), తుంగతుర్తి(మోత్కూర్, అడ్డగూడూరు) నియోజకవర్గాలకు సంబంధించి 812 పోలింగ్ కేంద్రాల్లో 8 కేంద్రాల లొకేషన్ మార్చనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రామచంద్రయ్య, అశోక్, లయఖ్ అహ్మద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరచారి, డిప్యూటీ తాసీల్దార్లు పాల్గొన్నారు.

గుట్టకు చేరిన ఆఖండ జ్యోతియాత్ర

యాదగిరిగుట్ట, మార్చి11 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ప్రారంభమైన 30వ అఖండ జ్యోతియాత్ర సోమవారం యాదగిరిగుట్టకు చేరింది. హైదరాబాద్‌లోని బర్కత్‌పుర యాదగిరిభవన్‌లో 8వ తేదీన ప్రారంభమైన అఖండ జ్యోతియాత్ర ఉప్పల్, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, రాయగిరి మీదుగా నాలుగు రోజులపాటు కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ రామకృష్ణారావు, ప్రధానార్చకుడు నల్లన్‌థీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, అధికారులు, భక్తులు, స్థానికులు ఘనస్వాగతం పలికి వేదపారాయణ పఠనం జరిపారు. అనంతరం అఖండ జ్యోతియాత్ర స్వామిచెంతకు వెళ్లింది.

మోత్కూరు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్
- రూ.19.84 కోట్ల అంచనా బడ్జెట్‌కు ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, మార్చి11 : మోత్కూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.19.84కోట్ల అంచనా బడ్జెట్‌ను పాలక వర్గం ఆమోదించింది. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపడుతున్న పనులపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. పట్టణ రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలన్నారు. మురికి కాల్వల నిర్మాణాలు చేపట్టాలన్నారు. వేసవి సమీపిస్తున్నందున నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కమిషనర్ శ్రీకాంత్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సిబ్బంది సహకరించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి



మున్సిపల్ సిబ్బందికి పెంచిన వేతనాల చెక్కులు అందజేస్తున్న మున్సిపల్ చైరపర్సన్ కవితాలక్ష్మీనర్సింహారెడ్డి

మోత్కూరు, మార్చి11 : మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సిబ్బంది సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. సిబ్బందికి పెరిగిన వేతనాల చెక్కులను సోమవారం ఆమె సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం 5, 12వ వార్డుల్లో రూ.2.50 లక్షల చొప్పున మంజూరు చేసిన మంచి నీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు బొడ్డుపల్లి కల్యాణ్‌చక్రవర్తి, కుమారస్వామి, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గుట్ట లక్ష్మీనరసింహుడికి నిత్యోత్సవాలు

యాదగిరిగుట్ట, మార్చి11 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి నిత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు నిర్వహించారు. అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పరమశివుడు, స్పటికలింగేశ్వరుడికి రుద్రాభిషేకం జరిపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ఉదయం 8 నుంచి 11:45 గంటల వరకు ఉభయ దర్శనాలు, బ్రేక్ దర్శనాలు నిలిపివేశారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.16,66,267 ఆదాయం సమకూరిందని ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో డీఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ, ఏఈఓలు గజవెల్లి రమేశ్‌బాబు, గట్టు శ్రవణ్‌కుమార్, రఘు, దుశెట్టి కృష్ణ, పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి, రాజన్‌బాబు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి పోచంపల్లి పట్టువస్త్రాలు

- పద్మశాలీ మహాజన సంఘం ఆధ్వర్యంలో సమర్పణ

ఆలయ ఈఓకు పట్టువస్త్రాలు అందజేస్తున్న పద్మశాలీ మహాజన సంఘం సభ్యులు

యాదగిరిగుట/భూదాన్‌పోచంపల్లి మార్చి11 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలి పూజల నిర్వహణ సమయంలో భూదాన్‌పోచంపల్లికి చెందిన పద్మశాలీ మహాజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను ఆలయ ఈఓ రామకృష్ణారావుకు అందజేశారు. ప్రతి ఏటా పోచంపల్లికి చెందిన పద్మశాలీ మహాజన సంఘం వారు నియమనిష్టలతో స్వామి, అమ్మవార్లకు స్వయంగా మగ్గంపై పట్టుతో తయారు చేసిన వస్త్రాలను అందజేస్తారు. ఈసారి అందజేసిన పట్టువస్త్రాలు గతంలో లేని విధంగా 22 రోజులపాటు శ్రమించి మగ్గంపై అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, ఉపాధ్యక్షుడు భోగ నర్సింహ, అంకం మురళి, సెక్రటరి భారత బాలరత్నం, చంద్రమౌళి, పాండు, అంజయ్య, చంద్రయ్య, అంజమ్మ పాల్గొన్నారు. అంతకు ముందు భూదాన్‌పోచంపల్లిలోని మార్కండేశ్వర స్వామి ఆలయంలో పట్టువస్త్రాలకు పూజలు చేశారు. అనంతరం భారీ ఊరేగింపుతో లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఆలయ చైర్మన్ చండికేశ్వర్, చేనేత నాయకుడు వెంకటేశం, లవకుమార్, చంద్రయ్య పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వెంకటేశ్వర స్వామి ఆలయం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 11 : మండలంలోని కనుముక్కుల గ్రామంలో గల పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఈ నెల 14 నుంచి 19వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఆలయాన్ని అందమైన రంగులు, విద్యుత్ లైట్లతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ కోట పుష్పలతామల్లారెడ్డి తెలిపారు. 14న క్షీరాభిషేకం, 15న ధ్వజారోహణం, 16న తిరుకల్యాణోత్సవం, మహా అన్నదానం, 17న క్షీరాభిషేకం, 18న లక్ష పుష్పార్చన, 19న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

డిప్యూటీ సీఎం భట్టిని అవమానించడం సరికాదు



ఆత్మకూరు(ఎం) సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్‌టీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్

ఆత్మకూరు(ఎం), మార్చి 11 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులతో పాటు ఇతర మంత్రులు పైన కూర్చొని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కింద కూర్చోబెట్టి అవమానపర్చడం సరి కాదని ఎమ్మార్పీఎస్‌టీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇదేనా కాంగ్రెస్ ప్రజా పాలన అని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క దళితుడైనందునే కింద కూర్చోబెట్టి అవమానించారన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపర్చిన సీఎం రేవంత్ వెంటనే భట్టికి క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు కొంపల్లి వెంకటేశ్, వడ్ల శ్రీను, కొంగరి రామచంద్రు, శ్రీనివాస్, ఎల్లయ్య, మల్లేశ్, నవీన్, నర్సయ్య పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

భువనగిరి సిటీ, మార్చి 11 : టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మారం జగదీశ్వర్‌రెడ్డిని టీఎన్‌జీఓ జిల్లా కార్యవర్గం సన్మానించింది. సోమవారం హైదరాబాద్‌లోని టీఎన్‌జీఓస్ సెంట్రల్ యూనియన్ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భగత్, ప్రధాన కార్యదర్శి ఖదీర్ కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

పోచంపల్లి మండల సమావేశం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 11 : ఈ నెల 18న ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనునట్లు ఎంపీడీఓ రాయపర్తి భాస్కర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కుష్టు రోగులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే

ఆత్మకూరు(ఎం), మార్చి11 : కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండల వ్యాప్తంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టినట్లు మండల వైద్యాధికారి విలియంకేరి తెలిపారు. ఈ నెల 24 వరకు సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించనున్నట్లు తెలిపారు. శరీరంపై మచ్చలు ఏర్పడడంతోపాటు స్పర్శ లేని వారు వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

ప్రతినెలా ఇంటి పన్నులు చెల్లించాలి : ఎంపీఓ

ఆత్మకూరు(ఎం), మార్చి 11 : గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలంతా ప్రతి నెలా ఇంటి పన్నులు చెల్లించాలని ఎంపీఓ పద్మావతి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో బిల్ కలెక్టర్ చింతల సుదర్శన్ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి ఇంటి, ఆర్టీ, దుకాణ దారుల పన్నులను వసూలు చేశారు. ఆయన వెంట సిబ్బంది యాస గోవర్ధన్, బాలరాజు, హరిబాబు ఉన్నారు.

పుస్తెల తాడు అపహరణ

మోత్కూరు, మార్చి11 : మున్సిపాలిటీ కేంద్రంలో పట్టపగలే దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో పూల వ్యాపారం చేస్తున్న గంగారపు యాద మ్మ మెడ నుంచి రూ.2.68 లక్షల విలువైన 4 తులాల బంగారు పుస్తెలతాడును దొంగిలించారు. సోమవారం బాధితురాలు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. తమ దుకాణంలో యాదమ్మ ఆదివారం మధ్యా హ్నం ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో పూల కోసమని ముగ్గురు గుర్తు తెలియని మహిళలు వచ్చి వెళ్లారని, తాను లేచేలోపే వారు వెళ్లిపోయారని, కాసేపటికి మెడలో పుస్తెల తాడు లేకపోవడం గమనించినట్లు తెలిపింది. ఈ మేరకు బాధితురాలు సోమవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

జీరో బిల్లు బాధితుల కష్టాలు తీరేనా?

- వందల సంఖ్యలో దరఖాస్తుల సవరణకు వస్తున్న బాధితులు

వలిగొండ ఎంపీడీఓ కార్యాలయం వద్ద గృహజ్యోతి దరఖాస్తుల సవరణకు వచ్చిన బాధితులు

వలిగొండ, మార్చి11 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారెంటీల అమలులో భాగంగా తమకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందించే పథకాన్ని ప్రభత్వం అమలు చేస్తుండగా, కొందరి విషయంలో మాత్రం గందరగోళం నెలకొన్నది. అన్ని అర్హతలు ఉండి జీరో బిల్లు రానివాళ్లు పంచాయతీ, విద్యుత్ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. సోమవారం ఒక్కరోజే వందల మంది ఎంపీడీఓ కార్యాలయానికి తరలిరావడంతో అధికారులు చేసేది లేక పోలీస్ బందోబస్తు నడుమ దరఖాస్తుల సవరణ చేపట్టారు. దరఖాస్తుల సవరణకు వచ్చే బాధితుల్లో ఎక్కువగా వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు, నిరక్షరాస్యులు ఉండడం గమనార్హం. దరఖాస్తుల సవరణ పూర్తయ్యేదెన్నడు, తమ సమస్యలు పరిష్కారమయ్యేదెప్పుడని బాధితులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ జితేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. గృహజ్యోతి దరఖాస్తుల సవరణను వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మండలానికి ఒకే లాగిన్ ఇచ్చారని, వలిగొండకు రెండో లాగిన్ కేటాయించాలని ఉన్నతాధికారులను కోరినట్లు చెప్పారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ మోహన్‌రెడ్డి

మర్రిగూడ, మార్చి 11 : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. 61మంది లబ్ధిదారులకు 61,07,076 రూపాయల విలువైన చెక్కులు అందించినట్లు తాసీల్దార్ బక్క శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ తారకారామన్, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు నల్ల యాదయ్య, మాస నీలిమ, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య పాల్గొన్నారు.

ఇండ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, మార్చి11 : మండలంలోని గొలనుకొండలో 27ఏండ్ల క్రితం ఎంపిక చేసిన లబ్ధిదారులకు సుధీర్ఘకాలం తర్వాత సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య 179 మందికి ఇండ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వపరంగా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గంధమల్ల అశోక్, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మి, మాజీ జడ్పీటీసీ నీలం పద్మావెంకటస్వామి, నాయకులు తీగల వెంకటేశ్, భీమగాని హరిబాబు, తండ మధు, దూపటి వెంకటేశ్, జనగాం ఉపేందర్‌రెడ్డి, కొండ్రాజు వెంకటేశ్వర్‌రాజు, జూకంటి ఫౌల్ పాల్గొన్నారు.

అఖండజ్యోతి పాదయాత్రకు ఎమ్మెల్యే పూజలు

అఖండజ్యోతి పాదయాత్రకు స్వాగతం పలికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 11 : యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి సంవత్సరం నిర్వహించే అఖండజ్యోతి పాదయాత్ర సోమవారం రాయగిరికి చేరుకున్నది. పాదయాత్రకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సద్ది వెంకట్‌రెడ్డి, పొట్టోళ్ల శ్యామ్‌గౌడ్, పక్కీరు కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లన్నగుట్ట బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం

పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

రామన్నపేట, మార్చి11 : మండలంలోని నిదానపల్లిలో మల్లన్నగుట్ట బ్రహ్మోత్సవాలు సోమవారం పరిపూర్ణం అయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి స్వామి వారి పల్లకీ సేవ, తెల్లవారుజామున అగ్నిగుండాలు, అనంతరం గెలుపు కార్యక్రమాన్ని బేతోజు సత్యనారాయణ శాస్త్రి సిద్ధాంతి, అర్చక బృందంచే నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి నాగిరెడ్డి, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ మందడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుత్తా నర్సిరెడ్డి, ఎంపీఓ అంజిరెడ్డి, ఎస్ఐ మల్లయ్య, కొండ మల్లేశం, కడారి స్వామియాదవ్, కసిరెడ్డి ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదుగాలి : ఏపీఎం

ఆత్మకూరు(ఎం) సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం కిరణ్

ఆత్మకూరు(ఎం), మార్చి 11 : మహిళ సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలు పొంది ఆర్థికంగా ఎదుగాలని ఏపీఎం కిరణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా సంఘాల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. బ్యాంక్ ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకొని నచ్చిన వ్యాపారం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు సామాజిక జీవన విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో సీసీ వెంకన్న, వీబీకే స్వప్న, విజయ, లక్ష్మి, మానస, అనిత, ఆండాలు పాల్గొన్నారు.

రామన్నపేట : మల్లేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆర్థిక సాయం

రామన్నపేట, మార్చి11 : మండలంలోని బాచుప్పలకు చెందిన మద్ది మల్లేశ్ ఇటీవల బండి పైనుంచి పడి తలకు తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించగా రూ.6 లక్షలు ఖర్చయ్యాయి. బాధితుడి ఇద్దరు కూతుర్లు ఎన్నారం పాఠశాలలో చదువుతుండటంతో విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. రూ.52వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నగేశ్, జహంగీర్, అరుణ, నర్సిరెడ్డి, విజయ, జ్యోతి, శేఖర్ పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని పారుపల్లికి చెందిన కడారు పర్వతాలు ఇటీవల చింత చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. సోమవారం విషయం తెలుసుకున్న శక్తి హమాలీ యూనియన్ సభ్యులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

చౌటుప్పల్, మార్చి 11 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, అనిత, శ్రీరాములు, ప్రసన్నరాణి, వసంత పాల్గొన్నారు.